మినీకథ

# సిక్



-సూర్య

"రాజుకు వంట్లో బాగా లేదుటోయ్! యివాళ ఫోన్ చేస్తే వాడి ఆఫీసులో వాళ్ళు చెప్పారు" సీతారామయ్య గారు మధ్యాహ్నం భోజనానికి యింటికి వచ్చినప్పుడు ఆయన భార్యతో చెప్పారు.

"పెద్దాడికి ఏమయిందండోయ్, విన్న కోడలు వుత్తరంలో తమూ, అబ్బాయీ కులాసాగా వున్నారని రాసిందిగా?"

'మా మనవడికి ఏమయిపోయిందర్రోయ్! అంతదూరం వుద్యోగంకోసం పంపించకండి, వున్న ఆ మాత్రం వుద్యోగం రాకుండా పోతుందా ... వా మాట ఎవరూ లెఖ్ఖ చెయ్యలేదు కదా."

"అమ్మా! నువ్వప్పుడే ముక్కు చీదకు. నువ్వు ... ఏమిటోయ్! వన్ను ఖంగారుపెట్టేస్తున్నావ్? ... ఫోను చేసినట్లు ... వుంటే ...."

రాజుకు అహ్మదాబాదులో ... మూడు నెలు ...

అయింది. రాజు నాన్నగారు సీతారామయ్యగారు హైదరాబాదులో వుద్యోగం చేస్తున్నారు. ఉన్న ఒక్క అమ్మాయికీ పెళ్ళిచేసి సంవత్సరం దాటింది. అల్లుడికి అమెరికాలో టెన్నిసీలో వుద్యోగం. పుత్ర సంతానం రాజు ఒక్కడే కావడంవల్ల సీతారామయ్యగారికీ, ఆయన భార్య రాజ్యంగారికీ, రాజు బామ్మకీ రాజంటే ప్రాణం. చిన్నప్పటి నుంచీ చాలా గారంగా పెంచారు.

"పోనీ యింకోసారి ఫోన్ చేసి విషయం వివరంగా కనుక్కోండి." పిచ్చిదానా! యిందాకా నేను రెట్టించి అడగలేదూ! వంట్లో బాగా లేదు. రెండు రోజుల నుంచీ ఆఫీసుకు రావడం లేదు. పోనీ, రేపోసారి ఫోన్ చెయ్యండి మేం ఎవరమైనా యివాళ సాయంత్రం వాళ్ళింటికి వెళ్ళి విషయం కనుక్కుంటాం అన్నారు.

"అయితే వెంటనే బొంబాయిలో ప్రసాదుకు ఫోన్‌చేసి చెప్పండి. మనకి మీనార్‌లో బయలుదేరడానికి సమయం ఎలాగూ లేదు. రాత్రి ఎక్స్‌ప్రెస్‌లో ... చేరుతున్నామని కాస్త దాదార్‌లో ...

దింపుకుని అహ్మదాబాద్ ట్రైనులో ఎక్కించమనిను. బొంబాయి నుంచి అహ్మదాబాదు చాలా ట్రైనులే వున్నాయట, కోడలు యిదివరకు వుత్తరంలో రాసింది."

"ముసల్దాన్నని నన్ను వదిలేయకండరోయ్, నేను కూడా వస్తున్నాన్రోయ్, అసలు రాత్రంతా ఒహటే పీడకలలు, ప్రొద్దున్న లేచినప్పటి నుంచి కుడి కన్ను అదరడం చూస్తే ఏం జరుగుతుందోనని భయపడుతూనే వున్నాను. భగవంతుడా వుండుండి ఎన్ని కష్టాలు తెచ్చిపెట్టావు నాయనా!"

"ఉండండ్రా బాబూ! యిద్దరూ చెరో వైపు నుంచీ వూదరగొట్టేస్తున్నారు, యింటికి వచ్చి వార్త చెప్పినప్పటినుండీ. రేపటికి విషయం తెలుస్తుంది కదా! జలుబు చేసిందో ఓ లంఖణం చేసాడో, దానికే ఖంగారుపడితే ఏలా? అసలు నాన్నగారు మమ్మల్ని పెంచినట్లు నువ్వు మమ్మల్ని వాడిని పెంచనివ్వలేదు. అందుకే అంత సుకుమారంగా తయారయ్యాడు. ఇంతకీ రాజ్యం, యివాళ నాకు భోజన యోగం వుందా. లేదా?'

"ఒరేయ్! నీ వ్యవహారం చూస్తే ఎలాగూ బయలుదేరేలా లేవు, మమ్మల్ని వెళ్ళనిచ్చేలా లేవు. నేను వెళ్ళడం ఖాయం. ఏమ్మా కోడలూ, నువ్వు కూడా యిలా ఆలోచిస్తూ కూర్చుంటావా నాతో వస్తావా? అసలు వాడు రాకపోయినా మనం ఎలాగో అలాగ బొంబాయి చేరుకుంటే ప్రసాద్ నన్ని అహ్మదాబాద్ బండి ఎక్కించకపోడు. అసలు యిక్కడి నుంచి అక్కడి దాకా సరాసరి బండి లేకపోవడం వల్లనే కదా యీ పాట్లన్నీను. లేకుంటే నెలకోసారి వెళ్ళి వచ్చేదాన్ని. మొన్న యిటువైపు ఓట్లకోసం వచ్చినప్పుడు ఆ అబ్బాయికి అదే చెప్పాను.' 'మీ 'అన్నకి' చెప్పి మా మనవడు వుండే చోటికి సరాసరి బండి వేయించు మా యింట్లో ఓట్లన్నీ మీకే' అని, ఆ ఏడుకొండలవాడు అతని యందు వుండి వేయిస్తే మనం అదృష్టవంతులమే."

"ఏమండీ! పోనీ ప్రసాద్‌కి ఫోన్ చేసి చెప్పండి— మమ్మల్ని అహ్మదాబాద్ ట్రైను ఎక్కిస్తాడు."

"ఉండవోయ్! అమ్మ అంటే ఏదో పూర్వకాలం మనిషి అనుకో. నువ్వు కూడా ఏమిటి అంత హైరాన పడిపోతున్నావ్! మనిషన్నాక రోగం రాకుండా పోతుందా. అయినా నన్ను కాస్త ఆలోచించనీ."

ఓసోస్! బోడి వేదాంతం చెప్పొచ్చావులేరా! అయినా నీది మరీ చోద్యం కాకపోతే యిందులో ఆలోచించుకోడానికి ఏముందిరా? వాడికి వంట్లో బాగాలేదని నువ్వే స్వయంగా విన్నావుకదా, వూరు కాని వూర్లో యిద్దరూ ఏం యిబ్బంది పడుతున్నారో అవైనా లేదేంటి ఏకు. పైగా నీ కోడలు కూడా చిన్న పిల్ల. తెలుగు తప్ప వేరే భాష తెలియదాయె. నాకే కాలూ, చెయ్యీ ఆడితేనా యీ పాటికి బయలుదేరి వుండేదాన్ని." మీ మీద ఆధార పడ్డాననేకదా నా మాటంటే లక్ష్యం లేకుండా పోయింది. ఆ మహారాజు వెద...డుతూ నన్ను కూడా తనతో ఎందుకు తీసు...లేదో," అంటూ పంచె చెంగుతో కళ్ళు తుడ... మొదలు పెట్టింది బామ్మగారు.

